# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. రైతు బతుకు ఆగమే



ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాయగిరిలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరైన బీజేపీ విజయ సంకల్ప సభ ఇలా జనంలేక వెలవెలబోయింది

## కామారెడ్డి కాంగ్రెస్ నేతల్లో టెన్షన్

కామారెడ్డి కాంగ్రెస్ నేతలకు టెన్షన్ పట్టుకున్నది. అక్కడ కాంగ్రెస్ సభలన్నీ అట్టర్‌ఫ్లాప్ అవుతుండడమే వారి ఆందోళనకు కారణం. వారం రోజుల క్రితం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో నిర్వహించిన బహిరంగ సభ అట్టర్‌ఫ్లాప్ అయింది. ఇది మర్చిపోకముందే ఆదివారం రాహుల్‌గాంధీ నిర్వహించిన సభకు జనాల నుంచి స్పందన రాలేదు. కీలక నేతల సభలకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో కాంగ్రెస్ నేతల్లో ఆందోళన మొదలైంది. జనసమీకరణకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో టెన్షన్ పడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇక్కడ బరిలో ఉండడంతో పరువు కాపాడుకునేందుకు ఆ పార్టీ విశ్వప్రయత్నాలు చేస్తున్నది. గెలుపు సంగతి దేవుడెరుగు కనీసం డిపాజిట్ అయినా దక్కించుకునేందుకు నేతలు ప్రయత్నిస్తున్నారు. వారెంతగా తన్నులాడుతున్నా ప్రజలు మాత్రం వారి సభలకు ముఖం చాటేస్తున్నారు.

# జనం లేని సభలు.. ఖాళీ కుర్చీలు

హస్తం సభలకు స్పందన కరువు • రాహుల్, సిద్ధరామయ్యనూ కానని జనం • ప్రసంగిస్తుండగానే సభల నుంచి జంప్

మధ్యలోనే ప్రసంగాన్ని ఆపేసిన సిద్ధూ • అనువాదం సరిగ్గా లేక రాహుల్ అసహనం • కాంగ్రెస్ సభలన్నీ అట్టర్ ఫ్లాప్

హైదరాబాద్, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ అగ్రనేతలకు వరుసగా పరాభవాలు ఎదురువుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, ఖర్గే, సిద్దరామయ్య ఎవరొచ్చినా ప్రజలు డోంట్‌కేర్ అంటున్నారు. సభలన్నీ జనంలేక వెలవెలబోతున్నాయి. వారి ప్రసంగాలను పెడచెవిన పెడుతున్నారు. ఆదివారం రాహుల్‌గాంధీ కామారెడ్డి, అందోల్, సంగారెడ్డిలో నిర్వహించిన సభలు ఫ్లాప్ సినిమాను తలపించాయి. అందోల్ సభలో జనం వచ్చినా జనాల కన్నా కుర్చీలు అధికంగా ఉన్నాయి. లారీల్లో తీసుకొచ్చిన కుర్చీలను కిందికి దింపాల్సిన అవసరం రాలేదు. రాహుల్ హిందీ ప్రసంగం ఎవరికీ అర్థంకాక తలలు పట్టుకున్నారు. అద్దంకి దయాకర్ తెలుగు అనువాదం గందరగోళంగా ఉండడంతో రాహుల్ ప్రసంగిస్తుండగానే ప్రజలు ఇంటిముఖం పట్టారు. గమనించిన రాహుల్ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసి దయాకర్ అనువాదంపై అసహనం వ్యక్తం చేశారు. మక్తల్‌లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు విచిత్ర అనుభవం ఎదురైంది. ఆయన కార్నర్ మీటింగ్‌కు జనాలు రాలేదు. వచ్చిన వారు కూడా ఆయన ప్రసంగిస్తుండగానే వెళ్లిపోవడం ప్రారంభించారు. వెళ్లిపోతున్న వారిని ఆపేందుకు ప్రయత్నించినా లాభం లేకపోవడంతో ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేశారు.



సంగారెడ్డిలో ఆదివారం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రసంగిస్తుండగానే ఇంటిముఖం పడుతున్న ప్రజలు



కామారెడ్డిలో ఆదివారం కాంగ్రెస్ నిర్వహించిన సభలో రాహుల్‌గాంధీ ప్రసంగిస్తుండగా లేచివెళ్లిపోతున్న ప్రజలు



రాయగిరి బీజేపీ సభలో కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతుండగా వెనక్కి వెళ్లిపోతున్న ప్రజలు

# కొడంగల్‌లో బీఆర్ఎస్ నేతపై హత్యాయత్నం

- బాబా ఫసియుద్దీన్‌పై రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి, అతడి అనుచరుల దాడి
- రెండు కార్లు ధ్వంసం.. ఇద్దరికి గాయాలు
- పరిగి పోలీసులకు ఫిర్యాదు
- ఫిర్యాదులపై స్పందించకుంటే కోర్టుకు వెళ్తాం: సోమ భరత్



సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మక్త్యాలలో బీజేపీ కార్యకర్తల దాడిలో ప్రచారరథంపై చిరిగిన పోస్టర్లు

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ)/కోస్గి/వర్గల్: రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యం, అరాచకం పెరిగిపోతున్నది. ఓటమి భయంతో బీఆర్ఎస్ నాయకులపై దాడులకు తెగబడుతున్నారు. కొడంగల్‌లో శనివారం రాత్రి బీఆర్ఎస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారు. డ్రైవర్, గన్‌మెన్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఆయన త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. బాబా ఫసియుద్దీన్ హైదరాబాద్ వస్తుండగా.. ఆయన కార్లను కాంగ్రెస్ నాయకులు కోస్గి నుంచి వెంబడించి దాడికి పాల్పడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, అతడి 40 మంది అనుచరులు బొంరాస్‌పేట్ మండలం తుంకిమెట్ల గేటు సమీపంలో రోడ్డుకు అడ్డంగా రాళ్లను పెట్టి కర్రలతో దాడికి తెగబడ్డారు. రెండు కార్లను ధ్వంసం చేశారు. ఈ దాడిలో బీఆర్ఎస్ కార్యకర్తలకు గాయలయ్యాయి. బాబా ఫసియుద్దీన్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ దాడి నుంచి అల్లా, ప్రజల ఆశీర్వాదం వల్ల తాను బతికానని బాబా ఫసియుద్దీన్ చెప్పారు. తన వెంట వచ్చిన విద్యార్థులు, యువతపై కూడా దాడులు చేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ఓటమి భయంతో హత్య, హింసా రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

### బీఆర్ఎస్ ఫిర్యాదులపై స్పందించని సీఈసీ

బీఆర్ఎస్ ఇచ్చే ఫిర్యాదులపై ఎన్నికల సంఘం స్పందన సరిగా లేదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతిపక్షాలు ఇచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ తమ పార్టీ స్టార్ క్యాంపెయినర్లకు నోటీసులు ఇస్తున్న అధికారులు.. ప్రతిపక్షాలకు ఎలాంటి నోటీసులు ఇవ్వడం లేదని, వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ఫిర్యాదులపై సరిగ్గా స్పందించకుంటే కోర్టుకు వెళ్తామని ఆయన హెచ్చరించారు. మంత్రి కేటీఆర్‌కు ఇచ్చిన నోటీసుపై ఫిర్యాదు కాపీ కోసం చూస్తున్నామని, ఆ తర్వాత వివరణ ఇస్తామని తెలిపారు. బాబా ఫసియుద్దీన్‌పై రేవంత్‌రెడ్డి అనుచరులు హత్యాయత్నం చేశారని బాధితుడితో కలిసి సోమ భరత్‌కుమార్ ఆదివారం బీఆర్‌కేఆర్ భవన్‌లో సీఈవో వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేశారని, అయినా వారిపై చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. శనివారం రాత్రి నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని ఫామ్‌హౌజ్‌లో ఉన్న బీఆర్ఎస్ నేత జీఎస్ స్టేట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేరాలని తిరుపతిరెడ్డి తన అనుచరులతో వచ్చి కత్తితో బెదిరించాడని ఫిర్యాదు చేశారు.

### బీఆర్ఎస్ ప్రచారరథం పోస్టర్లు చింపిన బీజేపీ కార్యకర్తలు

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మక్త్యాలలో ఆదివారం బీఆర్ఎస్ ప్రచారరథం బీజేపీ కార్యకర్తలు దాడి చేశారు. మీనాజిపేటలో ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాపరెడ్డి రోడ్‌షో ముగించుకొని మక్త్యాలకు వస్తుండగా ప్రచారరథం పోస్టర్లను చింపివేశారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు పోస్టర్ ఎందుకు చించారని ప్రశ్నించగా, బీజేపీ కార్యకర్తలు గొడవకు దిగారు. బీజేపీ చర్యను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు.

# ఖర్చంతా మాదే.. ప్లీజ్ వచ్చి ఓటేయండి

- ఓట్ల కోసం ప్రాధేయపడుతున్న పార్టీల అభ్యర్థులు
- ఇతర ప్రాంతాల్లో ఉన్నవారికి ప్రత్యేక బస్సులు
- హైదరాబాద్ శివారు కాలనీల్లో ఆత్మీయ సమ్మేళనాలు



హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ప్రధాన పార్టీల హడావుడి పెరిగిపోతున్నది. ఈసారి ఒక్క ఓటు కూడా మిస్ కాకూడదని అన్ని పార్టీల నేతలు తెగ తంటాలు పడుతున్నారు. తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగి ఉండి జీవనోపాధి కోసమో లేక వేరే అవసరాల కోసమో ప్రాంతాలకు వెళ్లిన వారిని వెనక్కి రప్పించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. వారికి ఫోన్లు చేసి తమకు ఓటు వేసేందుకు రావాలని పిలుస్తున్నారు. అందుకయ్యే ఖర్చులన్నీ తామే భరిస్తామని ప్రాధేయపడుతున్నారు. పలు నియోజకవర్గాల అభ్యర్థులు ఏకంగా వాహనాలను పెట్టి చెన్నై, ముంబై, షోలాపూర్ లాంటి దూరప్రాంతాలకు వలస వెళ్లినవారిని రప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు అభ్యర్థులు ఈ పనిని తమ అనుచరులకు అప్పగించి ఓట్ల కోసం ఫాలోఅప్ చేస్తున్నారు. దీంతో ఎవరికి ఓకే చెప్పాలో తెలియక ఆయా ఓటర్లు సతమతమవుతున్నారు. మరోవైపు నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లోని నియోజకవర్గాల అభ్యర్థులు ఓట్ల కోసం హైదరాబాద్‌లోని కాలనీల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఆయా జిల్లాకు చెందిన ఎంతో మంది ప్రజలు హైదరాబాద్‌తోపాటు నగర శివారు కాలనీల్లో స్థిరపడటంతో వారి ఓట్ల కోసం పలువురు అభ్యర్థులు ఇప్పటికే ప్రత్యేక బస్సులను బుక్ చేసినట్లు సమాచారం.

## మలబద్ధకాన్ని తగ్గించే బ్యాక్టీరియా!

టెక్సాస్, నవంబర్ 26: కడుపులోని మంచి బ్యాక్టీరియాకు మలబద్ధకానికి ఉన్న సంబంధాన్ని పరిశోధకులు కనుగొన్నారు. 'ప్రోబయాటిక్ బిఫైడో బ్యాక్టీరియం జన్యువులు పేగు చలనశీలతను ప్రభావితం చేస్తుంది. తద్వారా మలబద్ధకాన్ని తగ్గిస్తుంది' అని 'సెల్ హోస్ట్, మైక్రోబీ' జర్నల్ వార్తా కథనం పేర్కొన్నది. 'వివిధ రకాల ప్రోబయాటిక్–ముఖ్య అవయవాలకు మధ్య సంబంధాన్ని కనుగొనే ప్రయత్నం చేశాం. ఎలుకలు, మానవులపై ప్రయోగాల్లోనూ ఒకేరకమైన ఫలితాలు వచ్చాయి' అని జియాగ్నం వర్సిటీ ప్రొఫెసర్ కిగ్జాయో జాయి చెప్పారు.

# గంటలో హైదరాబాద్‌కు!

- ఉమ్మడి జిల్లా కేంద్రాల నుంచి 60 నిమిషాల్లో రాజధానికి
- ఢిల్లీ తరహాలో తెలంగాణ ర్యాపిడ్ ట్రాన్సిట్
- తెలంగాణ రాష్ట్రంలో ఇదీ బీఆర్ఎస్ ప్రభుత్వ విజన్
- రూ.55,440 కోట్లతో తొమ్మిది మార్గాల్లో
- 792 కిలోమీటర్ల మేర నిర్మాణాలకు ప్రతిపాదన




హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని దాదాపు ఏ ప్రాంతం నుంచి అయినా హైదరాబాద్‌కు ప్రజలు గంటలో చేరుకొనేలా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. కొత్తగా తొమ్మిది మార్గాల్లో తెలంగాణ ర్యాపిడ్ ట్రాన్సిట్ (టీఆర్‌టీ) వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంచేసింది. 792 కిలోమీటర్ల టీఆర్‌టీ మార్గం నిర్మించేందుకు రూ.55,440 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే ఈ ప్రాజెక్టుపై ఇటీవలే పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పట్టణీకరణ నేపథ్యంలో ఢిల్లీ పరిధిలోని నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్సీఆర్)లో కేంద్ర ప్రభుత్వం నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం (ఆర్‌ఆర్‌టీఎస్)ను చేపట్టింది. రూ.1,66,000 కోట్లతో ఢిల్లీ, హర్యానా, యూపీ, రాజస్థాన్ రాష్ట్రాల్లోని పట్టణ ప్రాంతాలను కలుపుతూ అత్యంత వేగవంతమైన రైల్వే వ్యవస్థను తలపెట్టింది. అదే తరహాలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి తెలంగాణ నలుమూలలా వెళ్లేందుకు అత్యంత వేగవంతమైన ప్రజా రవాణా వ్యవస్థగా తెలంగాణ ర్యాపిడ్ ట్రాన్సిట్ (టీఆర్‌టీ) వ్యవస్థను తీసుకురానున్నది. ఇందుకోసం సుమారు రూ.55,440 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రజా రవాణా వ్యవస్థలో ప్రస్తుతం ఉన్న రైలు, బస్సులు, మెట్రో, కార్లు వంటివే కాకుండా పర్యావరణహితమైన, అత్యంత వేగవంతమైన టీఆర్‌టీ వ్యవస్థను తెలంగాణలో నిర్మించేందుకు తొమ్మిది మార్గాలను ఎంపిక చేశారు. హైదరాబాద్ నగరంపై భారం పడకుండా రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా గంట వ్యవధిలో హైదరాబాద్‌కు చేరుకొనే అత్యాధునిక ప్రజా రవాణా వ్యవస్థగా టీఆర్‌టీని సిద్ధం చేశారు. ఇది కార్యరూపం దాల్చితే తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల్లో తొమ్మిది జిల్లాల నుంచి గంటలోనే ప్రజలు హైదరాబాద్‌కు చేరుకోవచ్చు.

### గంటకు 180 కి.మీ వేగంతో..

ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కి.మీ పొడవున ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి భూ ఉపరితలంపైనే టీఆర్‌టీ రైల్వే మార్గాన్ని నిర్మించనున్నారు. దీనిపై రైళ్లు గంటకు అత్యధికంగా 180 కి.మీ వేగంతో, సరాసరిన 100 కి.మీ వేగంతో రాకపోకలు సాగిస్తాయి. ఇందుకోసం కిలోమీటర్‌కు రూ.70 కోట్ల చొప్పున 9 మార్గాల్లో 792 కి.మీ మేర టీఆర్‌టీ మార్గం నిర్మించేందుకు రూ.55,440 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అవకాశం కూడా ఉన్నది. ఓఆర్ఆర్ చుట్టూ కొత్తగా మెట్రో నోడల్ పాయింట్లను గుర్తించి అక్కడి నుంచి 9 మార్గాల్లో టీఆర్‌టీ ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రాథమిక నివేదికను ప్రభుత్వం రూపొందించింది. ఈ ప్రాజెక్టును ప్రజా రవాణా వ్యవస్థలోనే విప్లవాత్మక చర్య సర్కారు భావిస్తున్నది.

### హైదరాబాద్ నుంచి తొమ్మిది మార్గాల్లో ప్రతిపాదించిన టీఆర్‌టీ ప్రాజెక్టు వివరాలు

1. శామీర్‌పేట ఓఆర్ఆర్ నుంచి గజ్వేల్, కొమరవెల్లి, సిద్దిపేట, కరీంనగర్ (140 కి.మీ) రూ.9800 కోట్లు.
2. ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ నుంచి మొదలై బీబీనగర్, భువనగిరి, యాదాద్రి, జనగామ, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ (113 కి.మీ) రూ.7910 కోట్లు.
3. పెద్ద అంబర్‌పేట ఓఆర్ఆర్ నుంచి చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, నల్లగొండ (81 కి.మీ) రూ.5670 కోట్లు.
4. నార్కట్‌పల్లి నుంచి నకిరేకల్ మీదుగా సూర్యాపేట, కూసుమంచి, ఖమ్మం (111 కి.మీ). రూ.7770 కోట్లు.
5. శంషాబాద్ ఓఆర్ఆర్ నుంచి షాద్‌నగర్, బాలానగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్ (50 కి.మీ) రూ.3500 కోట్లు
6. తెలంగాణ పోలీస్ అకాడమీ (టీఎస్‌పీఏ) ఓఆర్ఆర్ నుంచి మొయినాబాద్, చేవెళ్ల, మన్నెగూడ, వికారాబాద్ (60 కి.మీ). రూ.4200 కి.మీ
7. ముత్తంగి ఓఆర్ఆర్ నుంచి ఇస్నాపూర్, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ (64 కి.మీ). రూ.4480 కోట్లు.
8. కండ్లకోయ ఓఆర్ఆర్ నుంచి మేడ్చల్–మనోహరాబాద్, మాసాయిపేట, చేగుంట, మెదక్ (70 కి.మీ)రూ.4900 కోట్లు.
9. చేగుంట నుంచి రామాయంపేట, బికనూర్, కామారెడ్డి, ఇందల్‌వాయి, డిచ్‌పల్లి, నిజామాబాద్ వరకు (103 కి.మీ) రూ.7210 కోట్లు.

**టీఆర్‌టీ కారిడార్‌లో ప్రయాణానికి అయ్యే సమయం (గంటల్లో)**

| కారిడార్ | టీఆర్‌టీ ద్వారా | రోడ్డు |
|---|---|---|
| 1.హైదరాబాద్–కరీంనగర్ | 1.25 | 3.30 |
| 2.హైదరాబాద్– వరంగల్ | 1.18 | 2.45 |
| 3.హైదరాబాద్ – నల్లగొండ | 0.50 | 2.00 |
| 4.హైదరాబాద్–ఖమ్మం | 1.45 | 4.15 |
| 5.హైదరాబాద్ – మహబూబ్‌నగర్ | 0.53 | 2.00 |
| 6.హైదరాబాద్ – వికారాబాద్ | 0.36 | 1.30 |
| 7. హైదరాబాద్ – మెదక్ | 0.42 | 2.15 |
| 8.హైదరాబాద్ – నిజామాబాద్ | 1.34 | 3.00 |
| 9.హైదరాబాద్ – జహీరాబాద్ | 0.43 | 2.15 |